క్లుప్తంగా

అలరించిన అన్నమయ్య కీర్తనలు

చిక్కడపల్లి: అన్నమయ్య కళా సమితి ద్వితీయ వార్షికోత్సవం త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై అన్నమయ్య కీర్తనలు గోష్ఠి గానం సభికులను అలరించాయి. సంగీత గురువు సుమలత 40 మంది శిష్యబృందంతో 40 నిమిషాల్లో 40 అన్నమయ్య కీర్తనలు 40 రాగాలతో గానం చేసి గోల్డెన్ రికార్డులో నమోదు చేశారు. విశిష్ఠ అతిథిగా పాల్గొన్న సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ.. అన్నమయ్య కీర్తనలలో భక్తి, శృంగారం, సామాజిక చింతన, వైరాగ్యం అన్ని రసాలు కలిసి ఉన్నాయన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మాధవ పెద్దిసురేష్, గోల్డెన్ స్టార్ స్థాపకుడు బింగి నరేందర్‌గౌడ్, సుమలత బృందం గానగోష్ఠి రికార్డు నమోదు యోగ్యతా పత్రాన్ని అందజేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందని రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం విశ్వకర్మ సన్మాన్ యోజన విడుదలను పురస్కరించుకుని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో గడిల పాలన కొనసాగిస్తూ.. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడాలంటే ప్రతి ఒక్కరూ బీజేపీని గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూసరాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థసారధి, బీజేవైఎం మాజీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, శివాజీ, జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్, వేణుగోపాల్, కె.బాబు, తదితరులున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సత్కారం

అంబర్‌పేట: తెలంగాణ సాయుధ పోరాటంలో కొత్తిమీర ప్రేమ్‌రాజ్‌యాదవ్ అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎం.గౌతమ్‌రావు అన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రేమ్‌రాజ్‌యాదవ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పలువురు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సత్కరించారు. ముఖ్యఅతిథిగా గౌతమ్‌రావు హాజరై ప్రేమ్‌రాజ్ కుటుంబసభ్యులు సురేష్ యాదవ్, చంద్రకాంత్ యాదవ్‌లతో కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విముక్తి కోసం చేసిన పోరాటాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, అమృత, కృష్ణగౌడ్, శ్యామ్‌రాజ్, రామేష్ యాదవ్, ఆనంద్‌గౌడ్, నాగభూషణంచారి, రవీందర్‌గౌడ్, శ్యామ్‌యాదవ్, శ్రీధర్, ప్రవీణ్, ఈశ్వర్ తదితరులున్నారు.

'విశ్వకర్మ యోజన' వృత్తిదారులకు మేలు

ముషీరాబాద్: విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ చేతి వృత్తిదారులకు ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం ఎంతో మేలు చేస్తుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణశర్మ అన్నారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్‌లో భారీ బైక్ ర్యాలీని నిర్వహించి ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కులవృత్తుల వారికి నైపుణ్య శిక్షణకు అవసరమైన ఆధునిక పనిముట్లు, యంత్రాలు, పరికరాల కొనుగోలు కోసం ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఉచిత ఆర్థికసాయం అందించనుందన్నారు. కేంద్రం బడుగు, బలహీన వర్గాలకు కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకానికి ఇప్పటికే రూ.13 వేల కోట్ల నిధులను మంజూరు చేశారని 30 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నాలుగున్నర లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. బీజేపీ నాయకులు ఆర్.నరేష్, శ్యామ్, సుబ్రహ్మణ్యం, సాయికృష్ణయాదవ్ తదితరులున్నారు.

'సెప్టెంబర్ 17 విద్రోహ దినమే'

ముషీరాబాద్: నిజాం రాజ్యంలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు కరువై వెట్టి చాకిరి అమలవుతున్నప్పుడు దానిని తుదముట్టించడానికి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 1948 జూలై 4న దొడ్డి కొమురయ్య హత్యతో ప్రారంభమైందని, యూనియన్ సైన్యాలు నిజాంతో లోపాయికారి ఒప్పందం చేసుకుని పోరాటాన్ని అణచివేశారని అందుకే ఈ సెప్టెంబర్ 17 విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఆరోపించారు. క్రూరుడైన ఖాసీంరజ్వీని పాకిస్తాన్‌కు సురక్షితంగా పంపారన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం !

అంబర్‌పేట: మట్టి వినాయకున్ని పూజించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆకాంక్షించారు. శనివారం గొల్నాకలోని భారతీయ విద్యాభవన్ పాఠశాలలో చేపట్టిన మట్టి వినాయకులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మట్టి గణపతులను పంపిణీ చేసి పూజించాలని కోరారు.

- పటేల్‌నగర్ చౌరస్తాలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ స్థానికులకు మట్టి గణపతులను అందజేశారు. బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ అయ్యప్ప ఆలయ వద్ద కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి స్థానికులకు మట్టి గణనాథులను పంపిణీ చేశారు.

మట్టి గణపతుల పంపిణీ..

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ సూచించారు. శనివారం కాచిగూడ, మోతీమార్కెట్‌లో మట్టి గణపతులను ఆమె పంపిణీ చేశారు. మట్టి గణపతులను పూజించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సుభాష్ పటేల్, శేర్‌సాగర్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, కేసరి నర్సింగ్‌యాదవ్, మారిశెట్టి ప్రతిభ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి..

ముషీరాబాద్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర కాంగ్రెస్



మట్టి గణనాథులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కమిటీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ అన్నారు. శనివారం ఇందిపార్కు చౌరస్తాలో మట్టి గణపతుల విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన నగేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. దేశంలో ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో ప్రజలు అనేక రకాల వ్యాధుల భారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పండుగ సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రసాద్, నాగసాయి, శ్రీనివాస్, వర్మా, లక్ష్మణ్, రాములు, శేఖర్ తదితరులున్నారు.

కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ ఆధ్వర్యంలో..

చిక్కడపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్



పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని జనప్రియ అబోర్డ్స్‌లో స్వాతి ప్రమోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసి కార్పొరేటర్ మాట్లాడారు. పర్యావరణహితం, సహజసిద్ధంగా మట్టితో చేసిన గణపతులను పూజించాలని సూచించారు. ప్రముఖులు సీహెచ్ నాగేందర్‌రావు, ప్రతాప్, మురళి, లక్ష్మి తదితరులున్నారు.



పటేల్‌నగర్ చౌరస్తాలో అందజేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న నగేష్‌ముదిరాజ్

చట్ట సభల్లో బీసీ బిల్లు పెట్టాలి

కాచిగూడ: చట్టసభలలో బీసీబిల్లు పెట్టాలని, మహిళా బిల్లులో బీసీ సబ్‌కోట చేర్చాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు అన్నారు. చట్ట సభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రజా ప్రాతినిధ్యం కల్పించాలనేది బీసీల చిరకాల డిమాండ్ అన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా అంశం చేర్చి పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందేలా కేంద్రం నిర్మాణాత్మకంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి, బీసీ జాగృతి అధ్యక్షుడు మురళీకృష్ణ, రాచమల్ల బాలకిషన్, నరేందర్, సంజీవ, వెంకట్, మహిళా ప్రతినిధులు



మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

భాగ్యలక్ష్మి, ప్రతిభ, అనురాధగౌడ్, దివ్య, సంగీత, సరస్వతి, బీసీ ప్రతినిధులు రూబిన్‌గౌడ్, బాబాయ్, చంద్రపాల్, నర్సింగరావు, ఎస్.శ్రీనివాస్, రఘుపతి, శ్రీనివాస్, దుర్గేష్, భాగయ్య, తదితరులున్నారు.

బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసుసురేష్



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు చట్టసభల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తమ పోరాటం ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం తలవంచిందని అభిప్రాయపడ్డారు. బీసీల తలరాతలు మారాలంటే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అవసరమన్నారు. అనేకసార్లు ఢిల్లీ వేదికగా బీసీ రాజ్యాధికార సమితి నిర్వహించిన ఉద్యమాలు, సిఫార్సులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో రాజ్యాంగ సవరణ ద్వారా బిల్లును ఆమోదింపచేయబోతుందని ఇది శుభపరిణామమన్నారు. బీసీ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందే దశలో సీఎం కేసీఆర్ బీసీలు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి లేఖ రాయడం శోచనీయమన్నారు. నాయకులు బోగ శ్రీనివాస్, బండారు పద్మావతి, ప్రవీణ్, దుర్గేష్, రాధాకృష్ణ, శ్రీలత తదితరులున్నారు.

నాయకత్వం అప్పగించాలి..

కాచిగూడ: ప్రధాన రాజకీయ పార్టీలు ఆయా పార్టీల నాయకత్వాన్ని బీసీలకు అప్పగించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, హైదరాబాద్ జిల్లా నాయకులు కార్తీక్ మహరాజ్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్లి ధర్నా నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఎస్సీని సీఎం అభ్యర్థిగా ప్రకటించాలన్నారు. పార్టీ నేతలు కౌలే జగన్నాథం, నరేందర్, సైదాబాబు, కృష్ణ లింగస్వామి, ఉదయ్, మల్లేష్, రాజీవ్, సైదులు, హనుమంత్ తదితరులున్నారు.

సీఎం స్వాగత కార్యక్రమానికి తరలిన నేతలు



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కాలేరు



బహిరంగ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అంబర్‌పేట: పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి వెళ్తున్న సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నాయకులు కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. శనివారం శంషాబాద్ వద్ద కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబర్‌పేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు..

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా కొల్లాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్ నేతృత్వంలో వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇంజినీరింగ్ అద్భుతమని ఈ పథకంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, సోమ సుందర్, శంకర్‌ముదిరాజ్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రతకు పాటుపడాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత పచ్చదనం, పరిశుభ్రత పరిరక్షణ కోసం పాటుపడాలని అంబేద్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భవానీ అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్-1,2,3 ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణ, పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారాలను తొలగించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాలతో పాటు తమ ఇంటి పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. కళాశాల డైరెక్టర్ రిషాకాంత్, ఏఓ కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తదితరులున్నారు.

హిందీ ఉపాధ్యాయులకు సత్కారం

కాచిగూడ: హిందీ సులభంగా వస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ భాషను నేర్చుకోవాలని భవన్స్ న్యూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పేరాల కృష్ణారావు అన్నారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా నారాయణగూడలోని కళాశాలలో హిందీ భాష అభివృద్ధికి కృషి చేస్తున్న హిందీ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ భాష హిందీ ప్రతి ఒక్కరికీ వచ్చి ఉండాలన్నారు. దేవనాగరి లిపి నుంచి ఆవిర్భవించిన హిందీ భాష విశిష్టమైన ప్రాముఖ్యతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం జాతీయ హిందీ భాషా దివస్ వేడుకలను నిర్వహిస్తోందన్నారు.

రైల్లో చైన్ స్నాచింగ్

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి చైన్ స్నాచింగ్ చేసిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం మధురానగర్ కాలనీకి చెందిన దాసరి బసవమ్మ (55) అరుణాచలం నుంచి ఓకా ఎక్స్‌ప్రెస్ రైల్లో కాచిగూడకు వస్తుండగా.. షాద్‌నగర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి నల్లపూసల తాడును తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలు శనివారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

వృద్ధురాలి అదృశ్యం



నల్లకుంట: ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం .. డ్రైవర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరం యాదగిరి కుటుంబసభ్యులతో నల్లకుంటలో నివసిస్తున్నాడు. ఆయన తల్లి నాగేశ్వరం లక్ష్మి (60) హౌజ్ కీపింగ్ చేస్తూ.. కుటుంబానికి ఆసరాగా ఉంటోంది. ఈ నెల 10న సాయంత్రం 5 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండానే ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువులను విచారించినప్పటికి ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన యాదగిరి తమ తల్లి కనిపించడం లేదంటూ శుక్రవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 87126 60554.

'సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి'

ముషీరాబాద్: కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐఆర్, ఫిట్‌మెంట్ ప్రకటించాలని మున్సిపల్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానంగా 2వ పీఆర్‌సీని ప్రకటించాలని సంగ్రామ సభను నిర్వహించారు. పాలడుగు భాస్కర్, ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. లక్ష ముప్పై వేల మందికి పైగా ఉన్న ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, దినసరి కూలీలు ఇతర సిబ్బందిని దశలవారీగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గత 20 ఏళ్లకు పైగా వివిధ శాఖల్లో తక్కువ వేతనాలతో పనిచేస్తూ.. తీవ్ర పని ఒత్తిడితో కుటుంబ పోషణ చేసుకోలేక



మాట్లాడుతున్న మున్సిపల్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్

అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 9 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేయకపోవడం ప్రభుత్వం చేసిన దగా తప్ప మరోటి కాదన్నారు. 2014 ఎన్నికల మెనిఫెస్టోలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలను రద్దు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతినెలా వేతనాలు సక్రమంగా చెల్లించాలని కోరారు. పనిఒత్తిడి ఆర్థిక భారం, అధికారుల వేధింపులు నిర్మూలించాలన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామి, ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ, నాయకులు సోమన్న, మధు, సురేష్, సుమిత్ర, సతీష్, సాంబయ్య తదితరులున్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో మినీ డీఎస్సీని ప్రకటించడం కాదని మెగా డీఎస్సీని ప్రకటించి నిరుద్యోగులను ఆదుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహించాలనుకుంటున్న డీఎస్సీ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని కోరారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభ్యర్థులను ఉద్దేశించి ఎర్ర సత్యనారాయణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలావెంకటేష్, మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 5089 టీచర్ పోస్టుల ప్రకటనను వెంటనే విరమించుకుని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 13,086 టీచర్ పోస్టులతో పాటు ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలతో ఏర్పడిన 9,979 ఉద్యోగ ఖాళీలతో సహా 23,065 టీచర్ పోస్టులతో కూడిన మెగా డీఎస్సీకి



ఇందిరాపార్కు వద్ద ధర్నాలో గుజ్జకృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ వెంకటేష్

నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్లికేషన్ గడువు ముగిసిన తర్వాత కనీసం నాలుగు నెలల సమయం కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షా విధానాన్ని ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్ లైన్ ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించాలని కోరారు. టెట్ పాసైన అభ్యర్థులందరికీ డీఎస్సీకి అవకాశం కల్పించాలన్నారు. గతంలో రూ.200లుగా ఉన్న డీఎస్సీ పరీక్ష ఫీజును రూ.1000కి పెంచడం సరికాదని దానిని రూ.500లుగా నిర్ణయించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అనంతయ్య, రాజేందర్, రాజ్‌కుమార్, సుధాకర్ తదితరులున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



ముషీరాబాద్: కవాడిగూడ డివిజన్ పరిధిలోని దోమలగూడ ఎస్‌బీహెచ్ కాలనీలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ ఆధ్వర్యంలో తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ.. వర్షాకాలం, వినాయకచవితి సందర్భంగా విద్యుత్ వైర్లకు, రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులను ఆమె ఆదేశించారు. బీజేపీ నేతలు వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, యువమోర్చా ప్రధాన కార్యదర్శి మోహన్‌సాయి, బస్తీ నాయకులు శివరాజ్, ఖలీల్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా పెరియార్ జయంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెరియార్ 144వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల గురించి నోరు విప్పని వారికి బుద్ధి చెప్పాలన్నారు. పెరియార్ స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం పోరాడాలని సూచించారు. టీపీఎస్‌కే కార్యదర్శి హిమబిందు, కేవీపీఎస్ కార్యదర్శి సైకిలాబ్‌బాబు, నాయకులు రషీద్, కోట రమేష్, చక్రధర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న భూపతివెంకటేశ్వర్లు

ఘనంగా బొజ్జా తారకం 7వ వర్ధంతి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజాన్ని చైతన్యం చేసిన వారే ప్రజల హృదయాల్లో ఉంటారని అలాంటి గొప్ప వ్యక్తి బొజ్జా తారకం అని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) తెలంగాణ ఆధ్వర్యంలో బొజ్జా తారకం 7వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. న్యాయవాదిగా మంచి గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు దళిత, ఆదివాసీ, ఇతర పేదవర్గాల హక్కులు, వారి రక్షణ కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి అన్నారు. తాను నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి చివరి క్షణం వరకు రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. ఆర్‌పీఐ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య, నల్లా సూర్యప్రకాష్, బంధు సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి, డాక్టర్ పసునూరి రవీందర్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, రజిత, నీల, శంకర్ తదితరులున్నారు.

రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కారం

ముషీరాబాద్: సివిల్ సప్లై శాఖలో బ్లూటూత్ కాంటా ద్వారా తూకం వేసి రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా అయ్యేలా న్యాయ పోరాటం చేసిన శ్రీరాములు పోరాటం రేషన్ డీలర్లకు ఎంతో మేలు చేస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. రేషన్ డీలర్లకు తూకం వేయకుండా బియ్యాన్ని సరఫరా చేయడం వల్ల డీలర్లకు నష్టం జరుగుతున్న నేపథ్యంలో శ్రీరాములు హైకోర్టుకు వెళ్లి బ్లూటూత్ కాంటా ద్వారా బియ్యం బస్తాలను తూకం వేసి ఆ ప్రకారమే డీలర్లకు ఇవ్వాలని హైకోర్టు ఆర్డర్ తీసుకొచ్చి సివిల్ సప్లై కమిషన్ ద్వారా అమలు జరిగేలా ఆయన చేసిన పోరాటం ఫలించిందన్నారు. సివిల్ సప్లై సర్కిల్-6 రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీరాములును రాంనగర్‌లోని ఎస్ఆర్టీ కమ్యూనిటీహాల్‌లో ఘనంగా సత్కరించారు. సర్కిల్-6 సివిల్ సప్లై డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి వాడకట్టురాజు, కోశాధికారి మోహన్,



సన్మానిస్తున్న రేషన్ డీలర్ అసోసియేషన్ ప్రతినిధులు

వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్‌రాజు, ఉపాధ్యక్షుడు కే.ఆర్.కే.ప్రసాద్, ఎర్రం శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, గజ్జెల సూర్యనారాయణలు మాట్లాడుతూ.. ఎలాంటి తూకం వేయకుండా బియ్యం బస్తాలు డీలర్లకు ఇవ్వడంతో 50 కిలోల బియ్యం బస్తాల్లో 4–5 కిలోలు తక్కువ వచ్చేదని, ఈ భారం డీలర్లపై పడేదన్నారు. ప్రస్తుతం వచ్చిన తీర్పుకు ఆర్డర్ వల్ల డీలర్లకు బియ్యం తరుగు సమస్య పరిష్కారమైందన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

ముషీరాబాద్: సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో రాంనగర్‌లో 200 మీటర్ల జాతీయజెండాతో భారీర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ఆలివేలి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న అప్పటి కేంద్ర హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో ఆపరేషన్ పోలో సైనికచర్యతో తెలంగాణను భారతదేశంలో విలీనం చేసి నిజాం నియంతృత్వ పాలనకు చరమగీతం పాడారని వివరించారు. దీంతో నిజాం నియంతృత్వ పాలన నుంచి తెలంగాణ రాష్ట్రానికి విమోచనం లభించినందున దీనిని విమోచన దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శి ప్రణీత్, ఉపాధ్యక్షులు నందిని, మనీష్, సోషల్ మీడియా కన్వీనర్ అభి, శివ, అనుష, హిమబిందు, నవీన్ తదితరులున్నారు.